సాక్షి
తిరుపతి

శనివారం । 1 । జూలై । 2023



బడుగుల రక్షణకే 'మానిటరింగ్'

బడుగు బలహీనవర్గాల హక్కులు కాపాడేందుకే విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు జేసీ తెలిపారు. - IIలో



ఉపాధికే సాంకేతిక విద్య

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి తెలిపారు. - IIలో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	37	27
చిత్తూరు	34	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	36	27

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోవడంతో భక్తులు శిలాతోరణం వరకు బారులు తీరారు. గురువారం అర్ధరాత్రి వరకు 62,005 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,127 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.75 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ప్రారంభం.. కిష్కింధకాండ పారాయణం



పారాయణం చేస్తున్న పండితులు

తిరుమల : తిరుమలలోని వసంత మండపంలో షోడశదిన కిష్కింధకాండ పారాయణదీక్ష శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. 16రోజులపాటు పారాయణదీక్ష కొనసాగనుంది. ఈ సందర్భంగా ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపల్ కేఎస్ఎస్ అవధాని మాట్లాడుతూ ×మారుతస్య సమోవేగే గరుడస్య సమోజవే× అనే శ్లోకంలో మొదటి అక్షరానికి సూచికగా తొలి రోజు 1 నుంచి 5 వరకు గల సర్గలను పండితులు పారాయణం చేస్తున్నట్టు వెల్లడించారు. సీతమ్మ జాడను వెతుక్కుంటూ సుగ్రీవుని వద్దకు శ్రీరాములవారు వెళ్లడం, ఆంజనేయుని పరిచయం, సుగ్రీవుడితో మైత్రి కుదుర్చుకోవడం, వాలిని శిక్షిస్తానని అభయం ఇవ్వడం తదితర ఘట్టాలను ఈ సర్గల ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. వసంత మండపంలో 16 మంది నిష్ణాతులైన వేద పండితులు శ్లోకాలను పారాయణం చేశారు. అదేవిధంగా, ధర్మగిరి వేద వి/్ఞానపీఠంలో మరో 16 మంది వేదపండితులు హోమం, జపాలు, వేదపారాయణం నిర్వహించారు


పకడ్బందీగా ఓటరు జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ బాలాజీ

తిరుపతి తుడా: ఓటరు జాబితాను ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. శుక్రవారం తిరుపతి ఎస్వీయూ ఆడిటోరియంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఎలాంటి అభియోగాలకు తావులేకుండా కొత్త ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించాలని సూచించారు. ఇప్పటికే ఉన్న ఓటర్ లిస్ట్‌లోని పేర్లను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయించాలని కోరారు. మృతి చెందిన ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, కార్పొరేషన్ కమిషనర్ హరిత మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించినట్టే ఇప్పుడు ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ జరుగుతోందన్నారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు వారికి కేటాయించిన ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, తిరుపతి నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డీటీ జీవన్ పాల్గొన్నారు.

కండలేరులో చేపల వేట నిషేధం



మత్స్యకారులతో మాట్లాడుతున్న సురేష్

రాపూరు : కండలేరు జలాశయంలో జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేటను నిషేధించినట్లు ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి సురేష్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మత్స్యకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేపల గుడ్లు పెట్టే సమయమని, అందుకే వేటపై ప్రభుత్వం నిషేధం విధించినట్లు వెల్లడించారు. ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఎవరైనా చేపల వేటను కొనసాగిస్తే వారి బోట్లు సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ కమలమ్మ పాల్గొన్నారు.

నాణ్యం.. నిరంతరాయం

"వేసవిలోనూ కోతల్లేని విద్యుత్ అందిస్తున్నాం.. ఇచ్చిన మాట మేరకు వ్యవసాయానికి పగటి పూటే సరఫరా చేస్తున్నాం.. వినియోగం పెరిగినా అవసరాలకు తగ్గట్టు అందుబాటులోకి తీసుకువచ్చాం.. ప్రతిపక్షాలవి తప్పుడు ఆరోపణలని ప్రజలకు అర్థమయ్యేలా నాణ్యమైన కరెంట్ అందజేస్తున్నాం.. ఎల్లోమీడియా విషపురాతలతో వెనక్కులాగేందుకు యత్నించినా మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నాం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జిల్లా అభివృద్ధి పథంలో పయనించేలా పకడ్బందీగా కృషి చేస్తున్నాం" అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు.

- డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్
- రైతులకు పగటిపూటే 9గంటల సరఫరా
- ప్రతిపక్షాలవి అసత్య ఆరోపణలు
- వంత పాడుతున్న ఎల్లోమీడియా
- జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో మంత్రి పెద్దిరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి) : ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుచానూరు సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ జూన్‌లో 280 మిలియన్ యూనిట్లతో అత్యధికస్థాయిలో వినియోగం పెరిగినా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డిమాండ్‌కు తగ్గట్లు విద్యుత్ అందించామని వెల్లడించారు. అయితే కొన్ని రాజకీయ పార్టీలు విద్యుత్ కోతలు విధిస్తున్నామని అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, వారికి ఎల్లోమీడియా తప్పుడు రాతలతో ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు.

మూతపడిన ఫ్యాక్టరీలకు పూర్వవైభవం

గతంలో కొందరు తమ స్వార్థ కోసం మూసివేసిన ఫ్యాక్టరీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్వవైభవం తీసుకువస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ఈ నెల 4వ తేదీన చిత్తూరు జిల్లాలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చేతులమీదుగా విజయ డెయిరీని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.



భద్రతా వారోత్సవాలకు హాజరైన నేతలు, అధికారులు

అలాగే షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు రూ.32 కోట్ల వేతన బకాయిలు, విజయా డెయిరీకి రూ.12 కోట్లు బకాయిలను త్వరలోనే చెల్లించనున్నట్లు వివరించారు. అమూల్ సంస్థ రాకతో ఇప్పటికే పాడి రైతులకు లీటర్ పాలపై రూ.5 నుంచి రూ.10 అదనంగా వస్తోందన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తుండడం ఆనందంగా ఉందని తెలిపారు.

విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు



మాట్లాడుతున్న ఏఎస్పీ కులశేఖర్

తిరుపతి క్రైం : విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఏఎస్పీ కులశేఖర్ ఆదేశించారు. శుక్రవారం తిరుపతి పోలీస్ అతిథిగృహంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. దిశ చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఆడపిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పోర్ట్ అధికారులు అనుమతించిన వాహనాలను మాత్రమే వినియోగించాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంస్థ ప్రాంగణంలో ఫిర్యాదులు, సలహా పెట్టెను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మైనర్లు బైక్‌లపై స్కూల్, కాలేజీకి వస్తే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని స్పష్టం చేశారు. వారు స్పందించకుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప పాల్గొన్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారు



సాక్షి, చిత్తూరు : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ఖరారైంది. ఈ నెల 4వ తేదీన చిత్తూరులో ఆయన పర్యటించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విజయా డెయిరీ వద్ద నూతనంగా ఏర్పాటు కానున్న అమూల్ డెయిరీకి శంకుస్థాపన చేయనున్నారు. చిత్తూరు పరిధిలోని చీలాపల్లి క్రిస్టియన్ మెడికల్ కళాశాల (సీఎంసీ) ఆవరణలో 300 పడకల ఆస్పత్రికి భూమి పూజ చేయనున్నారు. ఈనెల 4న సీఎం గన్నవరం నుంచి విమానంలో తిరుపతికి చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా చిత్తూరులోని మెసానికల్ మైదానానికి ఉదయం 10 గంటలకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.30 గంట వరకు కార్యక్రమాలను ముగించుకుని తిరిగి హెలికాప్టర్‌లో రేణిగుంటకు, అక్కడి నుంచి విమానంలో గన్నవరం వెళ్లనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటనకు అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా...

చిత్తూరులోని మెసానికల్ మైదానానికి ఉదయం 10 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి చిత్తూరు డెయిరీ చేరుకుని, భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు. 10.55గంటలకి పోలీస్ శిక్షణా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. 11.15 గంటలకు అమూల్ ప్రాజెక్టు ప్రారంభ సభలో పాల్గొంటారు. 12.55గంటలకు చీలాపల్లి సీఎంసీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటిగంటకు సీఎంసీ క్యాంపస్ భూమిపూజలో పాల్గొంటారు. 1.25గంటలకు సీఎంసీ ప్రాంగణంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరుతారు.

అనుమతులు లేవు.. వేలం లేదు!

చేపల చెరువులపై ఎల్లో మీడియా విషం కక్కుతోంది.. అబద్ధపు రాతలతో వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తోంది.. చెరువుల్లో చేపలు పట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి అనుమతులు మంజూరు చేయకపోయినా లేనిది ఉన్నట్లు చూపించేందుకు తెగబడుతోంది.. నిండు కుండలను తలపిస్తున్న చెరువుల్లో చేపలు ఎలా పడతారన్న కనీసం జ్ఞానం లేకుండా అసత్య కథనాలను వండివారుస్తోంది.

- చేపల చెరువులపై విషపు రాతలు
- నిండు కుండల్లా తటాకాలు
- చేపలు పట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వని మత్స్యశాఖ



తొణుకుమాల చెరువు

ఫ్యాక్ట్ చెక్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మైనర్ చెరువులు	గూడూరు, సూళ్లూరు పేట డివిజన్‌లోని చెరువులు :
8,098	1,053

చిల్లకూరు : పంచాయతీలు వేలం నిర్వహించకుండానే చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కును ఎలా పొందుతారో తెలియదు కానీ, 'చేపలు చెరువుల్లో తిమింగిలాలు' అనే శీర్షికన ఓ పత్రిక కథనాన్ని ప్రచురించింది. నిజానికి తిరుపతి జిల్లాలోని మైనర్ చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు ఆయా గ్రామ పంచాయితీల ఆధ్వర్యంలో మత్స్యశాఖ వేలం పాట నిర్వహిస్తుంది. చేపలు పట్టుకునే వేలం దక్కించుకున్నవారు పంచాయతీలకు, మత్స్యశాఖకు కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ ఏడాది చెరువుల్లో నీరు నిండుగా ఉండడంతో అధికారులు ఎక్కడా వేలం నిర్వహించలేదు. దీంతో గత ఏడాది వేలం దక్కించుకున్న వారు ఆయా చెరువుల్లో వదిలిన చేపలు సైతం అలాగే ఉండిపోయాయి. ఈ క్రమంలోనే చిల్లకూరు మండలం తొణుకుమాల గ్రామంలోని పెద్ద చెరువుతో పాటుగా మిగిలిన మూడు చెరువుల్లో కూడా మత్స్యశాఖ అనుమతులు రాక పోవడంతో చేపల వేలం పాటలు ఇప్పటి వరకు నిర్వహించలేదు. అయితే వేలం పాటలు జరిగి పోయి ఎవరికో చెరువులను అప్పగించినట్లు, వారు రూ.లక్షలు స్వాహా చేస్తున్నట్లు సదరు పత్రికలో రాయడంపై ఆయా పంచాయతీలవారు మండిపడుతున్నారు.

అనుమతులు తప్పనిసరి

ప్రజలకు తాజా చేపలు రొయ్యలు, పీతలు అందించేందుకు ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర పేరుతో హబ్‌లను ఏర్పాటు చేసింది. చేపల చెరువులను దక్కించుకున్న ప్రతిఒక్కరూ ఫిష్ ఆంధ్ర హబ్‌కు తాము పట్టుకున్న వాటిల్లో 30 శాతం చేపలు, రొయ్యలను అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మత్స్యశాఖాధికారులు కూడా ప్రతి చెరువులో చేపలు పట్టుకునేవారు ముందుగా అనుమతులు తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో పంచాయతీల వారు సైతం మత్స్యశాఖ అనుమతులు ఇచ్చిన తర్వాతే పత్రిక ప్రకటన జారీ చేసి మరీ వేలం పాటలను బహిరంగంగా నిర్వహిస్తున్నారు. ఇవేమీ పట్టని సదరు పత్రికవారు జరగని వేలం పాటను జరిగినట్లు అబద్ధపు రాతలు రాయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సొసైటీల పరిధిలో వేలం ఉండదు

పలు గ్రామాల్లోని మైనర్ చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీలు సొసైటీలుగా ఏర్పడ్డారు. ఈ సొసైటీల పరిధిలోని చెరువులకు వేలం పాట నిర్వహించరు. ఇదే అదనుగా కొందరు టీడీపీ నేతలు కొన్ని సొసైటీలపై పెత్తనం చెలాయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వేలం వేయలేదు



"మా పంచాయతీలోని చెరువులో చేపలు పట్టుకునే హక్కు కోసం గతంలో తీర్మానం చేసి మత్స్యశాఖ అనుమతి కోసం ప్రయత్నించాం, అనుమతులు రాలేదు. తెలుగు గంగ ద్వారా చెరువుకి పుష్కలంగా నీరు చేరడంతో చేపలు పట్టుకునే అవకాశం లేక పోయింది. అందుకే ఇప్పటి వరకు వేలం వేయలేదు.

– త్రివిక్రమ్ భూపతి, సర్పంచ్, తొణుకుమాల, చిల్లకూరు మండలం

ఫిష్ ఆంధ్రకు అందించాలి



జిల్లాలోని చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంది. దీంతో చేపలు పట్టుకునే వేలం నిర్వహించలేదు. చేపలు చెరువులతో పాటుగా రొయ్యల పెంపకందారులు, సొసైటీ సభ్యులు తాము పట్టుకున్న చేపలు, రొయ్యల్లో 30 శాతం ఫిష్ ఆంధ్ర హబ్‌కు అందించాలి.

– శ్రీనివాసనాయక్, జిల్లా మత్స్యశాఖాధికారి

నేటి నుంచి 'సురక్ష' సర్టిఫికెట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్వేలో గుర్తించిన వారికి ధ్రువీకరణ పత్రాలను శనివారం నుంచి పంపిణీ చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జగనన్న సురక్ష, నాడు–నేడు, మహిళాశిశు సంక్షేమంపై సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మొత్తం 691 సచివాలయాలకు గాను 35 సచివాలయాల పరిధిలో సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు సర్వేలో అందిన ఫిర్యాదుల మేరకు ధ్రువీకరణ పత్రాలు అందించనున్నట్లు వివరించారు. అలాగే నాడు–నేడు పనులను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. విద్యాకానుకను పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో డీఈఓ శేఖర్, డీఎల్‌డీఓ సుశీలాదేవి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి పాల్గొన్నారు.

70 కళాశాలలకు షోకాజ్ నోటీసులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ బోర్డు నిబంధనలు పాటించని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 70 జూనియర్ కళాశాలలకు నోటీసులను జారీ చేసినట్టు ఆర్‌ఐఓ రమేష్ తెలిపారు. తిరుపతి జిల్లాలో 40, చిత్తూరు జిల్లా పరిధిలో 30 మొత్తం 70 కళాశాలలకు వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

స్విమ్స్ డైరెక్టర్‌గా సదాభార్గవి



తిరుపతి తుడా: టీటీడీ జేఈఓ సదాభార్గవి శుక్రవారం స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించారు. స్విమ్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వెంగమ్మ శుక్రవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె స్థానంలో జేఈఓ సదాభార్గవిని ఫుల్ అడిషనల్ చార్జ్ డైరెక్టర్, వీసీగా నియమితులయ్యారు. ఈ మేరకు టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో డాక్టర్ వెంగమ్మ నుంచి సదాభార్గవి బాధ్యతలు స్వీకరించారు.

ఆగమోక్తంగా అర్జుని తపస్సు





నిమ్మకాయల కోసం పోటీలు పడుతున్న భక్తులు (ఇన్‌సెట్) తపస్సు మానుపై అర్జున వేషధారి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు ఘట్టాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. అర్జున వేషధారి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన తపస్సుమానును పద్యాలు ఆలపిస్తూ అధిరోహించారు. మంత్రించిన నిమ్మకాయలను చెట్టుపై నుంచి వెదజల్లారు. వాటిని చేజిక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



తపస్సు మాను వద్దకు అర్జునుడి ఉత్సవమూర్తిని తీసుకెళుతున్న దృశ్యం

క్లుప్తంగా


గంజాయి స్మగ్లర్ అరెస్ట్



పట్టుబడిన గంజాయి, స్మగ్లర్‌ను చూపుతున్న డీఎస్పీ సురేందర్‌రెడ్డి, సీఐ మహేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం : తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో సంచరిస్తున్న గంజాయి స్మగ్లర్‌ను గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టగా తమిళనాడుకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి వద్ద 30 కేజీల గంజాయి పట్టుబడినట్లు వెల్లడించారు. ఈ నెల 24వ తేదీన అనకాపల్లిలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి రైలులో తిరుపతి తీసుకువచ్చినట్లు నిందితుడు తెలిపాడని చెప్పారు. ప్రభాకర్‌పై పలు రాష్ట్రాల్లో కేసులు నమోదైనట్లు తమ విచారణలో తేలిందని వివరించారు. అంతరాష్ట్ర స్మగ్లర్‌ను అరెస్ట్ చేసిన ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి, సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. యువత మత్తుకు బానిసలుగా మారవద్దని కోరారు.

ప్రాణ ప్రదాతలకు సలాం



వైద్యోనారాయణోహరి అన్నారు పెద్దలు.. అంటే వైద్యుడు దేవుడితో సమానమని అర్థం. అందుకే వైద్యులమీద ఎన్ని విమర్శలు వచ్చినా, అనారోగ్యంగా ఉన్నప్పుడు వైద్యుల వద్దకే పరుగులు తీస్తుంటారు. అయితే కాసులకు కక్కుర్తి పడే వైద్యులు పదుల సంఖ్యలో ఉంటే, వృత్తిని దైవంగా భావించే వైద్యులు వేలల్లో ఉన్నారు. ఎంతో మందికి పునర్జన్మను ప్రసాదించారు. ధనిక, పేద తేడా లేకుండా సేవలు చేస్తున్నారు. నిరుత్సాహం నిండిన రోగులకు వ్యాధి నయం చేసి ధైర్యం నింపి చిరునవ్వుతో వెళ్లేలా చేస్తున్నారు. కరోనా మహమ్మారిలో ప్రాణాలకు తెగించి ఎంతోమందికి ఊపిరి పోశారు. డాక్టర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. – చిత్తూరు రూరల్

పుట్టిన ఊరే నేర్పింది



అటవీ ప్రాంతం.. అందులో కష్టాలతో కొట్టుమిట్టాడుతున్న కుటుంబం. చిరు వ్యవసాయం చేసుకునే దంపతుల (డీటీ నాయక్, బాణీభాయ్) కష్టార్జితం.. ప్రభుత్వం సాయం తోడుగా నిలవడంతో స్టెతస్కోప్ అందుకున్నారు డాక్టర్ బీఎస్‌కే నాయక్. ప్రస్తుతం చిత్తూరు డీసీహెచ్‌ఎస్‌గా సేవలందిస్తున్నారు. ఈయనది పల్నాడు జిల్లాలోని కోసూరు మండలం పెరికపాడు అనే గిరిజన ప్రాంతం. చిన్నతనం నుంచి అక్కడి కష్టాల్లోనే పెరిగారు. ఆ కష్టాలు ఆయనకు పాఠాలు నేర్పించాయి. తెలుగుమాస్టర్ సహకారంతో పట్టువదలకుండా ప్రభుత్వ బడుల్లోనే చదువుకున్నారు. ఇంటర్ వరకు గిరిజన హాస్టల్లో ఉంటూ చదువుకున్నారు. 1990లో గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పట్టా అందుకున్నారు. తర్వాత 1995లో ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తి చేసుకుని తొలిసారిగా విజయనగరం జిల్లాలోని కొమరాడ పీహెచ్‌సీలో బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లాలో పని చేస్తున్న భార్య డాక్టర్ మాధవితో కలిసి కొన్నాళ్ల పాటు సొంత గ్రామంలో వైద్య సేవలు చేశారు. తర్వాత ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ఆప్రాంతంలో ఇప్పటికీ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ వస్తున్నారు. పుట్టిన ఊరే తనను ఈ వృత్తిని స్వీకరించేలా చేసిందని నాయక్ తెలిపారు.

పట్టుబట్టి సాధించారు.



ఈయన చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్. స్వగ్రామం హైదరాబాద్‌లోని భాగ్‌లింగంపల్లి. తల్లి దండ్రులు రాధ, పోచ్చయ్య. స్థానికంగా ఉన్న ప్రభుత్వ విద్యాలయాల్లోనే ఉన్నత చదువు పూర్తిచేశారు. తల్లి ప్రోత్సాహంతో 1985లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1988లో పీజీ పట్టా అందుకున్నారు. తొలిసారిగా 1989లో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో విధుల్లో చేరారు. 2000లో చిత్తూరు జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్య సేవలో మంచి గుర్తింపు పొందారు. ఇందుకుగాను ప్రభుత్వం ఆయనకు పలు అవార్డులు, ప్రసంశపత్రాలను అందించింది. చిన్నతనంలో డాక్టర్ కావాలనే పట్టుదల నాడిపట్టేలా చేసిందని, అప్పటి కుటుంబ, సమాజ పరిస్థితులే తనను డాక్టర్‌ను చేశాయని ఆయన పేర్కొన్నారు. సోదరి సుగుణ చిన్నపిల్లల వైద్య నిపుణులుగా పనిచేసి విరమణ పొందారు. భార్య మీనాకుమారి చిత్తూరు జిల్లా ఆస్పత్రిలోనే అనస్థీషియాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు.

వైద్య ధర్మాన్ని పాటిస్తూ...



ప్రజలకు సేవ చేయాలన్న దృక్పథంతో ఈ వైద్య వృత్తికి వచ్చాం. వైద్య ధర్మాన్ని పాటిస్తున్నాం. పాటించాలి కూడా. వైద్య శిక్షణలో నేర్చిన అంశాలకు అనుగుణంగా పనిచేస్తున్నాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా పనిచేస్తున్నాం. చాలా మంది ఈ వృత్తిని తప్పుదారి పట్టించాలని చూస్తున్నారు. అలా చేయకూడదని నామనవి.

-ఉషశ్రీ, గైనికలాజిస్ట్, చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

వైద్య సేవ చేయడం గొప్ప వరం



ఆరోగ్యమే మహాభాగ్యమంటారు. మనిషికి ఎంత సంపద ఉన్నా దాన్ని అనుభవించే ఆరోగ్యం లేకపోతే అదంతా వృథాయే. అనారోగ్యంతో బాధపడే వారిని ప్రమాదస్థితి నుంచి కాపాడే శక్తి కేవలం వైద్యులకే ఉంది. పవిత్రమైన ఈ వృత్తిలో రాణించడం గొప్ప వరంగా భావిస్తున్నాం. సేవ అనే నినాదంతో పనిచేస్తున్నాం.

-జానకీరావ్, కల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు

రైతు కుటుంబం నుంచి దాక్టరుగా ...



ఈయన వ్యవసాయ కుటుంబానికి చెందిన డాక్టర్ రవిరాజు. స్వగ్రామం కార్వేటిన గరం ఆర్కేవీబీ పేట. ఈయన తల్లిదండ్రులు పూర్తిగా నిరక్షరాస్యులు. అయినా ఈయన మాత్రం డాక్టర్ కావాలన్న లక్ష్యంతో పట్టువదలకుండా చదివారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని వైద్యవిద్యను పూర్తి చేశారు. కొన్నాళ్లు స్విమ్స్‌లో పనిచేసి ఆస్ట్రేలియా వెళ్లిపోయారు. కొంతకాలం తరువాత స్వదేశానికి తిరిగొచ్చారు. ఇక్కడ కార్వేటినగరం, పుత్తూరు పీహెచ్‌సీలో డాక్టరుగా పనిచేశారు. డీఐఓగా ఉంటూ, అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,830
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,373
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,400
రిటైల్ వెండి గ్రాము	రూ.72.40

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలకు శ్రీకారం



పంచమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని శ్రీకపిలేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నపవిత్రోత్సవాలకు శుక్రవారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉదయం పంచమూర్తులైన కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, గణపతి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరుని ఉత్సవర్లకు పాలు, పెరుగు, తేనె, పసుపు, గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం కలశ పూజ, హోమం, పవిత్ర ప్రతిష్ట చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ కె.సుబ్బరాజు, కంకణభట్టార్ ఉదయకుమార్ గురుకుల్, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

దారిదోపిడీపై కేసు నమోదు

ఏర్పేడు : మండలంలోని జింకలమిట్ట సమీపంలో గురువారం రాత్రి జరిగిన దారిదోపిడీపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. శుక్రవారం ఆయన కథనం మేరకు.. వికృతమాల రెవెన్యూల్నోఇ డిక్సన్ కార్మాగారంలో రేణిగుంట మండలం పూలవానిగుంటకు చెందిన సందీప్ చంద్ర హెచ్‌ఆర్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని రాత్రి 9.30 గంటల సమయంలో బైక్‌పై ఇంటికి వెళుతుండగా నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. 15 గ్రాముల బంగారం, రూ.3వేల నగదు, ఏటీఎం, పాన్, క్రెడిట్ కార్డులను దోచుకున్నారు. సందీప్‌చంద్రను కంపెనీ అంబులెన్స్‌లో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ప్రణాళికాబద్ధంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ప్రణాళికాబద్ధంగా ఓటరు జాబితాను రూపొందించాలని, వివరాలు స్పష్టంగా ఉండాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024 జనవరి 5వ తేదీ నాటికి ఓటర్ల తుది జాబితాను ప్రకటించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు పకడ్బందీగా కసరత్తు చేయాలని సూచించారు. అందులో భాగంగా ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు జాబితా సవరణ చేపట్టాలన్నారు. అవసరమైన చోట పోలింగ్ కేంద్రాలు మార్పుచేయాల్సి ఉందని తెలిపారు. ముసాయిదా జాబితా అక్టోబర్ 17న ప్రచురించాలని, నవంబర్ 30 వరకు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలని వివరించారు. ముందుగా జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాను పరిశీలించి అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఓటరుకు సంబంధించి ఇంటి నంబర్ పక్కాగా ఉండాలన్నారు. ఇంటిలో సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఒక ఇంటిలో 10 మందికి పైగా ఓటర్లు ఉంటే ప్రత్యేకంగా వాటిని పరిశీలించాలని వెల్లడించారు. సమావేశంలో డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత, ఆర్డీఓలు కనకనరసారెడ్డి, రామారావు, శ్రీనివాసులు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బడుగుల రక్షణకే 'మానిటరింగ్'



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బాలాజీ

తిరుపతి అర్బన్ : బడుగు బలహీన వర్గాల హక్కులను కాపాడేందుకే విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు జేసీ డీకే బాలాజీ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని రిజర్వుడు నియోజకవర్గాల్లోని అన్ని మండలకేంద్రాల్లో కమ్యూనిటీ భవనాలకు 20 సెంట్ల చొప్పున భూమిని కేటాయించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆర్డీఓలు, తహసీల్దార్లు చర్యలు చేపట్టాలని సూచించారు. కమిటీ కన్వీనర్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య మాట్లాడుతూ ఏప్రిల్ 18వ తేదీన నిర్వహించిన మానిటరింగ్ సమావేశంలో సభ్యులు అందించిన 15 ఫిర్యాదులను పరిష్కరించేందుకు చేపట్టిన చర్యలను వివరించారు. అడిషనల్ ఎస్పీ వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 19 నమోదయ్యాయని తెలిపారు. డీఈఆర్‌ఓ కోదండరామిరెడ్డి మాట్లాడుతూ అట్రాసిటీ బాధితులకు ఎఫ్‌ఐఆర్ కాపీలు అందిన వెంటనే పరిహారం పంపిణీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కమిటీ సభ్యులు ఈ సందర్భంగా పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జేసీ స్పందిస్తూ వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓలు కనకనరసారెడ్డి, రామారావు, కిరణ్ కుమార్, ఎస్టీసెల్ డీఎస్పీ రమణకుమార్, డీఎస్పీలు యశ్వంత్, భవ్యకిషోర్, కమిటీ సభ్యులు రాపూరి ప్రసాద్ బాబు, నన్నూరు వెంకటరమణయ్య, మావులపాటి మహేష్, సోమలమ్మ, పసల సురేష్, వేమూరు ముని చంద్రారెడ్డి, వెంకటాచలం ముదిరాజ్, రమణ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

విజయనగరం: విజయనగరం జిల్లా వేదికగా మూడు రోజులుగా అండర్–7 విభాగంలో బాలబాలికల రాష్ట్ర స్థాయి చెస్‌పోటీలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మస్తాన్ బాబు, కోశాధికారి కె.వి.జ్వాలాముఖి బహుమతులను ప్రదానం చేశారు. ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎస్.శ్రీసాయివిభు ప్రథమ స్థానం దక్కించుకోగా, కోనసీమకు చెందిన జి.వెంకటశివరామ్ ద్వితీయ స్థానాన్ని చేజిక్కించుకున్నాడు. బాలికల విభాగంలో తిరుపతికి చెందిన వి.మోదితరెడ్డి ప్రథమ స్థానం కైవసం చేసుకోగా... కోనసీమకు చెందిన సీహెచ్ పోసాన రితికాఅక్షయ ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు సెప్టెంబర్ 20వ నుంచి 25వ తేదీ వరకు పశ్చిమబెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన వసతులు



సూచనలిస్తున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ బస్సుల డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. చార్జింగ్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా బస్సులు పార్క్ చేసుకోవాలని సూచించారు. ఏడుకొండల బస్టాండ్‌లో బస్ పాస్‌లు ఇస్తున్న కౌంటర్ వద్ద విద్యార్థులు ఎండలో నిలబడాల్సి వస్తోందని, అందువల్ల కౌంటర్‌ను మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కేటాయించిన ప్రాంతంలో కాకుండా ముందుకు వచ్చి వ్యాపారం చేస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్, ఏటీఎం రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

బాధ్యతగా హిందూ ధర్మ పరిరక్షణ



మాట్లాడుతున్న కమలానందభారతిస్వామి

చిల్లకూరు : నేటి సమాజంలో హిందూ ధర్మ పరిరక్షణను బాధ్యతగా భావించాలని భువనేశ్వరి పీఠాధిపతి శ్రీ కమలానందభారతిస్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని ఆయన సేవించుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతికి ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారు, వేదపండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామీజీ మాట్లాడుతూ వందలాది హిందూ ఆలయాల్లో అర్చకులు లేక నిత్యం కైంకర్యాలు సక్రమంగా సాగడంలేదన్నారు. దేవదాయశాఖతో పాటు, ప్రతి హిందువూ సహకరిస్తే ఆయా ఆలయాలు పూర్వవైభవం సంతరించుకుంటాయని వెల్లడించారు. హైందవ ధర్మంలో స్త్రీకి పవిత్ర స్థానం కల్పించారని తెలిపారు. స్త్రీని గౌరవించకుంటే ఎంతటి వారైనా నశించిపోతారనే విషయాన్ని రామాయణం, మహాభారతం తదితర కావ్యాలు తెలియజేస్తున్నాయని వివరించారు. భక్తి భావంతో ఆలయానికి వస్తే దేవుని కటాక్షం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నవీన్‌కుమార్, పాలకమండలి చైర్మన్ కందల ఆనంద్, వేద పండితుడు పవన్‌కుమార్ స్వామి, అర్చకులు చిరంజీవి పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో పరిశోధనలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌పీ రెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : యువత వినూత్న ఆలోచనలతో పరిశోధనలు చేపట్టాలని సీఎస్ఐఆర్– ఎన్ఐఐఎస్‌టీ మాజీ డైరెక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్వీయూ భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కాంటెంపరరీ ట్రెండ్స్ ఇన్ మెటీరియల్ సైన్స్ అండ్ స్పెక్ట్రోస్కోపీ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ మొహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ భౌతిక శాస్త్ర పరిశోధనల్లో మెటీరియల్ సైన్స్, స్పెక్ట్రోస్కోపీ ప్రాముఖ్యతను వివరించారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు తరచూ ఐఐటీ, ఐఐఎస్‌ఈ‌ర్‌లను సందర్శిస్తూ వాటికి సమానంగా పరిశోధనలను చేయాలని సూచించారు. అంతకుముందు సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్వీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, ఫిజిక్స్ ఇన్‌చార్జ్ విభాగాధిపతి బి.దేవప్రసాద్ రాజు, డాక్టర్ బి.హేమలత రుద్రమదేవి, అకడమిక్ కన్సల్టెంట్స్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కమల, డీన్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ రత్నాకరం పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

రేణిగుంట : మండలంలోని కరకంబాడి అమరరాజా పరిశ్రమ సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపారు. మృతుడికి సుమారు 40–45 ఏళ్ల ఉంటాయని, ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ఉండవచ్చని వెల్లడించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో వివరాలు తెలియలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉపాధి అవకాశాలకే సాంకేతిక విద్య

వరదయ్యపాళెం : పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే సాంకేతిక విద్య అందిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి శ్యామ్‌మోహన్ తెలిపారు. శుక్రవారం శ్రీసిటీలో ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ నోడల్ అధికారులు, ప్రిన్సిపాళ్లు, వివిధ పరిశ్రమల హెచ్‌ఆర్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. శ్యామ్‌మోహన్ మాట్లాడుతూ పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థుల్లో సాంకేతిక విజ్ఞానం పెంపొందిస్తున్నామన్నారు. జిల్లాలోని సాంకేతిక విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, ఆధునిక ల్యాబ్‌ల కల్పనకు పరిశ్రమల యాజమాన్యలు సహకరించాలని కోరారు. ప్రిన్సిపాళ్లు జి.ఉషాదేవి, ఎస్వీ కుమార్, వి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలలో అందుబాటులో ఉన్న కోర్సుల వివరాలను తెలియజేశారు. గతంలో పరిశ్రమ వర్గాల నుంచి వచ్చిన సూచనల మేరకు విద్యార్థులను తీర్చిదిద్దడానికి డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల పాఠ్యాంశాలను మార్పు చేశామని వివరించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ సమావేశ నిర్వహణకు చొరవతీసుకున్న నోడల్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీసిటీ నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. శ్రీసిటీ హెచ్‌ఆర్‌డీ మేనేజరు వి.శివకుమార్ మాట్లాడుతూ పరిశ్రమల్లో అప్రెంటీస్ అభ్యర్థుల కోసం ప్రత్యేక మేళాలను నిర్వహించాలని సూచించారు.